ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 48, పందిరి బీర 45, క్యాబేజీ 28, క్యారెట్ 28, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో సత్తా

అమీర్‌పేట: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోనల్ అడ్మిన్ ఎస్.వెంకటేశ్వర్ రావు, ఎస్.ఎం. వలి వివరాలు వెల్లడించారు. కళాశాలకు చెందిన ప్రీతమ్‌రెడ్డి 522 మార్కులతో (5వ ర్యాంకు), లక్ష్మి ప్రసన్న 573 మార్కులతో (8వ ర్యాంకు) ప్రదీప్ 510 మార్కులతో (45వ ర్యాంకు) సాధించారన్నారు. అకడమిక్ ప్రణాళిక అత్యున్నత బోధనా విధానంతో కామర్స్ కోర్సుల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు పొందారన్నారు.

శుభాకాంక్షలు



లాలాపేట: ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్‌ను బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఆలకుంట లింగయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాజరస్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల అందజేత



అవార్డులు అందుకున్న అడ్డగుట్ట సామాజిక సేవకులు

అడ్డగుట్ట: వివిధ సామాజిక సేవలు, కార్యక్రమాలు చేస్తున్న వారిని గుర్తించి ఇటీవల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహనీయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే, స్వామి వివేకానంద, అంబేడ్కర్, సుభాష్ చంద్రబోస్, గద్దర్ పేర్లపై మారేడుపల్లి మండలంలోని అడ్డగుట్టకు చెందిన అంబాల సమ్మయ్య, శివలింగం, రమేష్, జీ. మల్లేష్, ప్రభాకర్, భాగ్యలక్ష్మి, సువర్ణ, శ్యామల, జమున, శోభారాణి, లక్ష్మి, ప్రవీణ్, పుష్ప తదితరులు అవార్డులు అందుకున్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన డీసీ



డిప్యూటీ మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుభాష్‌రావు

లాలాపేట: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుభాష్‌రావు బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని తార్నాకలోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ డీసీని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకారం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న కోటి కుంకుమార్చన కార్యక్రమంలో రెండో రోజైన బుధవారం అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈఓ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

26న ఓయూకు మంత్రి పొంగులేటి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 26న ఓయూ క్యాంపస్‌కు రానున్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా 133 తరగతి గదిలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు మంత్రి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్‌తో పాటు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ కూడా హాజరవుతారన్నారు.

చట్టసభల్లో బీసీల వాటా కోసం

1 నుంచి మహా పాదయాత్ర

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం మార్చి 1వ తేదీ నుంచి మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామం మీర్జాన్‌పల్లె నుంచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట ఖిలాషాపూర్ వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర బీసీ కుల జనగణన బిల్లు పెట్టడం తెలంగాణ బీసీ సమాజం పోరాట విజయమని ఆయన అన్నారు. ఏదైనా రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం ప్రయత్నిస్తే వెంటనే సంఘ్ పరివార్ శక్తులు కోర్టులో కేసులు వేస్తుంటాయని, దీంతో జనాభా లెక్కలు లేకుండానే రిజర్వేషన్లు ఎలా పెంచుతారని కోర్టులు మోకాలడ్డుతాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం కుల జనగణన చేయనంటోందని, కేంద్రం, సుప్రీం కోర్టు మధ్య ఓబీసీల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధనకై.. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం జరిగే మహా పాదయాత్రలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

వేడెక్కుతున్న నీళ్ల రాజకీయం!

- కలిసి వచ్చిన బోర్‌వెల్స్ రెగ్యులేషన్ డ్రాఫ్ట్
- అభ్యంతరాలకు గడువు కోరిన బీజేపీ బోర్డు సభ్యుడు
- డ్రాఫ్ట్ నిబంధనలపై అభ్యంతరాలు సమర్పించిన ఎమ్మెల్యే లాస్య
- కంటోన్మెంట్‌లో తాగునీటి గోస తీరుస్తామంటున్న కాంగ్రెస్ నాయకురాలు వెన్నెల



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నీటి సమస్య రాజకీయ రంగు పులుముకుంటోంది. కంటోన్మెంట్ ప్రాంత వాసులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఉచిత నీటి పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, అందులో లొసుగులపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తాగు నీటి సమస్యపై ఫోకస్ పెంచాయి. బోర్డులో నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగుతున్న బీజేపీ నేత రామకృష్ణ బోర్డు పరిధిలో కొత్తగా అమలుకు సిద్ధమైన బోర్‌వెల్స్ రెగ్యులేషన్ డ్రాఫ్ట్‌పై అభ్యంతరాలకు గడువు పెంచేలా బోర్డు అధికారులపై ఒత్తిడి చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత బోర్‌వెల్స్ రెగ్యులేషన్ ముసాయిదాపై తన అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా సీఈఓ మధుకర్ నాయక్‌కు అందజేశారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులుగా, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెన్నెల, స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత మర్రి అమరేందర్ రెడ్డితో పాటు బుధవారం సీఈఓను తాగునీటి సమస్య, పరిష్కార మార్గాలపై చర్చించారు. కంటోన్మెంట్ సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు వెన్నెల పేర్కొన్నారు.



సీఈఓకు అభ్యంతరాల ప్రతిని అందజేస్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత



సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

గడువు పెంచాకే అభ్యంతరాలు..

కంటోన్మెంట్ పరిధిలో తాగునీటి బోర్‌వెల్స్ తవ్వకం, వినియోగానికి సంబంధించి 'రెగ్యులేషన్స్ ఫర్ డిగ్గింగ్ అండ్ యూజ్ ఆఫ్ బోర్‌వెల్స్ ఇన్ సికింద్రాబాద్ కంటోన్మెంట్' పేరిట రూపొందించిన ముసాయిదాపై ఎట్టకేలకు అభ్యంతరాలు నమోదు అవుతున్నారు. ఈ మేరకు రెండు నెలల క్రితమే డ్రాఫ్ట్ ప్రకటించి, నెల రోజులు గడువు ఇచ్చినప్పటికీ ఒక్క అభ్యంతరం కూడా నమోదు కాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన బోర్డు సమావేశంలో అభ్యంతరాల స్వీకరణకు మరో పది రోజులు గడువు ఇవ్వాల్సిందిగా నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ విజ్ఞప్తి చేయగా బోర్డు మరో అవకాశం కల్పించింది. దీంతో పలువురు తమ అభ్యంతరాలు అందజేస్తున్నారు. కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్తా ఇటీవలే తమ అభ్యంతరాలు అందజేశారు. తాజాగా ఎమ్మెల్యే లాస్య నందిత బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో పాటు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి తన అభ్యంతరాలను సమర్పించారు. బోర్‌వెల్స్‌ను మీటర్లు బిగించడంతో పాటు రోజుకు వంద లీటర్ల కన్నా అదనంగా నీటిని తోడుకునే వారికి ఛార్జీలు వేసే ప్రతిపాదన సరికాదని ఎమ్మెల్యే సూచించినట్లు తెలుస్తోంది.

ఏమిటీ కొత్త నిబంధనలు..

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ జారీ చేసిన (సీజీడబ్ల్యూఏ) జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నిబంధనలు రూపొందించారు.

- కంటోన్మెంట్ పరిధిలో ఈ పాటికే ఉన్న బోర్‌వెల్స్‌తో పాటు నూతన బోర్‌వెల్స్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.
- ప్రతి బోర్‌వెల్‌కు మీటర్ ఏర్పాటు చేసుకోవాలి లేకపోతే రూ.5 వేలు జరిమానా విధిస్తారు.
- రెసిడెన్షియల్ అవసరాల కోసం రోజుకు 100 లీటర్లు మాత్రమే తోడుకోవాలి. అదనపు నీటికి కిలో లీటర్‌కు రూ.3 చొప్పున, కమర్షియల్ అయితే రోజుకు 50 లీటర్లు దాటితే కిలో లీటర్‌కు రూ.10 చొప్పున ఛార్జీ చెల్లించాలి.

అదనపు భారం తగ్గేలా చూస్తాం

రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు విడుదల చేస్తున్న నీటి మోతాదును పెంచాల్సిందిగా తాము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతామని వెన్నెల పేర్కొన్నారు. అదనపు నీటి విడుదల కోసం అదనపు కనెక్షన్ ఛార్జీలు చెల్లించాల్సిందిగా గత ప్రభుత్వం సూచించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించాలని సీఎంను కోరుతామన్నారు. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును కంటోన్మెంట్‌కూ విస్తరించాలని విన్నవిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత



ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత

రసూల్‌పురా: నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత హామీ ఇచ్చారు. మూడో వార్డు పరిధిలో బుధవారం ఆమె పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడుతూ అభివృద్ధి పనులను పరిశీలించారు. మడ్‌ఫోర్ట్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయం వద్ద నిర్మిస్తున్న దక్షిణ కాళీకా దేవి ఆలయం పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. మన ఊరు మన బడి పథకం క్రింద నిధులు విడుదల జరిగినా కాంట్రాక్టరు పనులు చేపట్టడం లేదని ప్రధానోపాధ్యాయురాలు సుప్రద ఐరీన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి భవన మరమ్మతుల పనులు, విద్యార్థులకు డైనింగ్ హాల్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధులు, బోర్డు నిధులు రూ. 14 లక్షల వ్యయంతో చేపడుతున్న తాగునీటి పైపులైను పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. ఎమ్మెల్యే వెంట నివేదిత, అనితా ప్రభాకర్, సాయికిరణ్, అశోక్. సుదర్శన్, శేఖర్, రాకేష్, ఆలయ నిర్మాణ దాత నర్సింహా, మధు, సంధ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ఓయూలో జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వచ్చే నెల 27, 28 తేదీలలో జాతీయ స్థాయిలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలను నిర్వహించనున్నారు. బుధవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఫిల్మ్ ఫెస్టివల్ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జష్న్-ఏ-సైన్మా పేరుతో జరిగే షార్ట్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలలో దేశ వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, విద్యార్థులతో పాటు పీహెచ్‌డీ విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని జర్నలిజం విభాగం హెడ్ ప్రొ.సతీష్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఓయూలో బైపాస్ రోడ్డు పనులు ఆపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చేపట్టిన బైపాస్ రోడ్డు పనులను నిలిపి వేయాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు బుధవారం డిమాండ్ చేశారు. క్లోజ్‌డ్ క్యాంపస్ పేరుతో రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుతో ఎవరికి ఉపయోగం లేదన్నారు. కేవలం రూ. కోట్లల్లో విలువ చేసే ఓయూ భూముల కబ్జా కోసమే గత బీఆర్ఎస్ ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారని రోడ్డు పనులు ఆపకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి స్పెషల్ ఫోకస్!

- 'గాంధీ' లో కాంట్రాక్టు సిబ్బందికి ప్రత్యేక కమిటీ
- అవకతవకలకు చెక్ పెట్టేందుకు హెడ్ కౌంటింగ్



హెడ్‌కౌంటింగ్‌కు హాజరైన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు మేన్‌పవర్ మేయింటనెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు ఛైర్మన్‌గా మరో ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. గాంధీ ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సంస్థలు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండేందుకు ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం హెడ్ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఆయా సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 700 మంది సిబ్బందిని ఒకే చోటుకు చేర్చి, ఒక్కొక్కరి పేరు పిలుస్తూ వారిని గుర్తించి, ఆధార్ కార్డు, ఫొటోలను సేకరించారు. నూతనంగా ఏర్పాటైన కమిటీ ప్రతినిధులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీత భత్యాలు, వేతనాలు, సెలవులు, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, సమస్యల పరిష్కారం, వేధింపులు తదితర అంశాలను పరిశీలించి తగు చర్యలు చేపడతారు.

కమిటీ ఏర్పాటు..

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటైన మేన్‌పవర్ మేయింటనెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు వ్యవహరిస్తారు. సభ్యులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్, ఏఓ సుభాన్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్ఓడీ నరేందర్ నియమితులయ్యారు.

మహిళల కోసం..

ఆస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే మహిళల కోసం కంప్లయింట్ రిడ్రెషల్ కమిటీని ఏర్పాటు చేశారు. మహిళ సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడితే కమిటీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్ఎంఓ పద్మ నేతృత్వంలో కో ఆర్డినేటర్‌గా అసిస్టెంట్ డైరెక్టర్ ఫ్లోరెన్స్ మెర్లిన్, సభ్యులుగా నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, ఆర్ఎంఓ జాహ్నవి, జీడీఎక్స్ సంస్థ ప్రతినిధి విజయలక్ష్మీను నియమిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదు పెట్టెల ఏర్పాటు...

ఆస్పత్రి సిబ్బంది, రోగులు తమ సమస్యలను తెలిపేందుకు అత్యవసర, ఇన్, అవుట్ పేషెంట్ విభాగాల్లో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. సిబ్బంది బాగోగులు, వేతనాలు, వేధింపులు తదితర అంశాలు, సమస్యలను పరిష్కరించేందుకు రెండు కమిటీలను ఏర్పాటు చేశామని, ఆయా కమిటీలకు నేరుగా లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సంస్థల ఆధ్వర్యంలో ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారో స్పష్టమైన డేటా కోసం హెడ్ కౌంటింగ్ ప్రక్రియ చేపట్టామన్నారు.



హెడ్ కౌంటింగ్‌తో పాటు ఇతర వివరాలు సేకరిస్తున్న గాంధీ పాలనాధికారులు

ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.కమలాకర శర్మ



ప్రొ.శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డా.అరవింద

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.సాగి కమలాకర శర్మ రెండేళ్ల కాల వ్యవధికి నియమితులయ్యారు. ఇంత కాలం అధిపతిగా కొనసాగిన ప్రొ.కాశీం పదవీ కాలం ముగియడంతో తెలుగు శాఖకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ (బీఓఎస్) ఉన్న ప్రొ.శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించగా తన పీహెచ్‌డీ శిష్యురాలు డాక్టర్ అరవింద పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఉత్తమ బోధనకులు, పరిశోధనకులుగా పేరుగాంచిన ప్రొ.శర్మ జ్యోతిష్యం, సాహిత్యంపై పది పుస్తకాలను రాశారు. తెలుగుతో పాటు సంస్కృతం, ఇంగ్లిష్, జ్యోతిష్యం, ఫిలాసఫీ, యోగా శాస్త్రంలో ఎంఏలు, జర్నలిజం, ప్రాకృతంలో పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన ప్రొ.శర్మ బహుభాష కోవిదుడు. అనేక అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన వివిధ టీవీ చానల్స్‌లో ఉదయం ఆధ్యాత్మిక, భక్తి తదితర ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలలో ఉపదేశం ఇస్తారు. ప్రొ.శర్మ వద్ద 14 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేయగా మరో పది మంది వివిధ అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు.

షోల్డర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ లో అడ్వాన్స్ టెక్నాలజీ



మాట్లాడుతున్న సర్జన్లు

సనత్‌నగర్: షోల్డర్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో వచ్చిన అధునాతన విధానాలపై బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, షోల్డర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో షోల్డర్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో అధునాతన పద్ధతులు, టెక్నాలజీ, ఇంప్లాంట్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో గత 15 ఏళ్లుగా షోల్డర్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లు చేస్తున్నామన్నారు. మోకాలు మార్పిడి ఆపరేషన్ గురించి ప్రజల్లో ఇప్పటికే మంచి అవగాహన ఉందని, కానీ షోల్డర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ గురించి అంతగా అవగాహన లేదన్నారు. గత దశాబ్ద కాలంగా షోల్డర్ సర్జరీలో అధునాతన అడ్వాన్స్‌మెంట్ పురోగతి వచ్చిందన్నారు. మోకాలు మార్పిడి శస్త్రచికిత్స లాగానే భుజం జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో కూడా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన 'బ్లూ ప్రింట్ టెక్నాలజీ' అనే సర్జరీ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆపరేషన్ చేయడం కంటే ముందుగానే ఆ పేషెంట్‌కు ఏ రకమైన జాయింట్, ఏ సైజ్ జాయింట్, ఏ పొజిషన్‌లో అమర్చాలనేది బ్లూప్రింట్ తయారు చేస్తారని తద్వారా ఆపరేషన్‌ను సులభంగా మరింత ఖచ్చితత్వంతో చేయడం జరుగుతుందన్నారు.

కాలుష్యంతో ప్రశ్నార్థకంగా మానవాళి మనుగడ



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

కంటోన్మెంట్: కాలుష్యంతో పర్యావరణం కలుషితమై మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఎన్వీరాన్మెంట్ ప్రొటెక్షన్, బయో డీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. కంటోన్మెంట్ పికెట్ గార్డెన్‌లో ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యం చేయడం కోసం మార్చి 31న సికింద్రాబాద్ హరిహరకళా భవన్ లో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలుష్యంతో ప్రజలు అనారోగ్య పాలై వారి కుటుంబాలు ఆర్థికంగా వెనుక పడుతున్నారని చెప్పారు. ప్రస్తుత పర్యావరణంపై ప్రభుత్వానికి ఓ నివేదిక ఇవ్వనున్నామన్నారు. ఈ సదస్సులో విద్యావేత్తలు, లాయర్లు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు గందమాల యాదయ్య, ప్రతినిధులు మోత్కూరు మల్లేష్, కే బి నర్సింగ్ రావు, సి.అప్పారావు,బి.లక్ష్మణ్ రావు, పి.శ్యామ్యూల్, ఎం.మహేష్ పాల్గొన్నారు.

ఈజీ మనీకి ఆశపడొద్దు

- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన
- సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: రోజు రోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అమాయక ప్రజల నుంచి లక్షలు, కోట్ల రూపాయలను కేటుగాళ్లు కాజేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ కారణంగా బాధితులు సైబర్ వలలో పడుతున్నారు. తాజాగా సైబర్ నేరాలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ భవానీల ఆధ్వర్యంలో నారాయణగూడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నకిలీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ మోసాలు, పె ట్టుబడి మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలతో పా టు ఇతర సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఈ తరహా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేటుగాళ్ల మాయమాటల ద్వారా పంపించే సందేశాలను నమ్మవద్దని చెప్పాం '. కొన్ని కేసులలో తమ అనుభవాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానంగా స్టాక్ మార్కెట్‌లో సెబి అనుమతి ఉన్న యాప్‌లలో కాకుండి ఇతర యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టవద్దని, దీంతో పాటు స్టాక్ బ్రోకర్ వారి అధికారిక అకౌంట్లలలో మాత్రమే డబ్బు స్వీకరిస్తారని, తమ పెట్టుబడులను వ్యక్తిగత బ్యాంకు ఖాతా లకు బదిలీ చేయవద్దని, గూగుల్ ప్లే, వారి సొంత వెబ్‌సైట్‌ల నుంచి డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు ఆయా అప్లికేషన్‌లు ఒకసారి నిర్ధారించుకోవాలని, తమ తమ డీమ్యా ట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో ఎప్పుడూ పంచుకోవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలలో వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగాంలలో నకిలీ సంభాషణలను నమ్మవద్దని, వారు పంపిచే ఆకర్షణీయమైన ప్రకటనలతో కష్టపడి సంపాదించిన డబ్బును గుడ్డిగా పెట్టుబడి పెట్టవద్దనే పలు అంశాలపై విద్యార్థుకు సమగ్రమైన అవగాహన కల్పించారు.

పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తాం

హిమాయత్‌నగర్: డివిజన్‌లోని అన్ని బస్తీలలో పేదలకు ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రామన్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని బుధవారం మెల్కొటే పార్క్‌లో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌ను రామన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివిధ టెస్టులను చేసి, వారికి సంబంధించిన రిపోర్ట్‌ని అందజేశారు. అనంతరం వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ తరహా ఉచిత ఆరోగ్య శిబిరాలను రానున్న రోజుల్లో డివిజన్‌లోని పేదల ప్రజల కోసం అన్ని బస్తీలలో ఏర్పాటు చేస్తామని రామన్ గౌడ్ అన్నారు. డాక్టర్ అనురాగ్ మెల్కొటే పార్క్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్‌రావు, 180 మంది వాకర్స్ పాల్గొన్నారు.

కేంద్రం లిఖిత పూర్వక హామీలను నెరవేర్చాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... చట్టబద్ధంగా పంటల సేకరణ, సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణను ఆపడం, లఖీంపూర్ ఖేరీలో రైతుల ఊచకోతకు ప్రధాన కుట్రదారు హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేలిని తొలగించి ప్రాసిక్యూట్ చేస్తామని ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. తిరిగి ఆందోళన చేస్తున్న పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై అణచివేత కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య, సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, జంగారెడ్డి, మూడ్ శోభన్, పి.ప్రసాద్, అరుణజ్యోతి, టి.జి.నర్సింహారావు, ఆర్.శ్రీరామ్‌నాయక్, టి.స్కైల్యాబాబు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.